క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పాదపూజ



లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద మహాస్వామికి పాదపూజ చేస్తున్న భక్తులు

సీతంపేట: శ్రీలలితా పీఠాధిపతి, కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పాదచరణాలకు భక్తులు పాదపూజ నిర్వహించారు. లలితానగర్‌లోని పీఠం దర్బారు హాల్‌లో ఆదివారం ఉదయం పండితుల వేద మంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో పాదపూజ చేశారు. అనంతరం స్వామీజీ భక్తులను ఆశీర్వదించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి దర్శనం కోసం విచ్చేశారు. పలువురు భక్తులు మంత్రోపదేశం తీసుకున్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఐదో పట్టణ సీఐగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



మల్కాపురం: కంచరపాలెం ఐదో పట్టణ లా అండ్ ఆర్డర్ సీఐగా సిహెచ్.ప్రసాద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ప్రసుత్త సీఐ భాస్కరరావు సిక్ లీవ్‌లో ఉండటం వల్ల ఆయన స్థానంలో అటాచ్‌డ్ సీఐగా ప్రసాద్‌ను నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్ నియమించారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ప్రసాద్ బదిలీపై కంచరపాలెం పోలీస్ స్టేషన్ సీఐగా వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు సిబ్బందిని సమన్వయం చేస్తూ విధులు నిర్వహిస్తానని ఈ సందర్భంగా ప్రసాద్ తెలిపారు.

పూడికతో నిండిన గెడ్డలు



రేసపువానిపాలెం గెడ్డలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలోని గెడ్డల్లో పూడికలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. పారిశుద్ధ్య అధికారులు పట్టించుకోకపోవడం లేదని, నెలల తరబడి పూడికలు తొలగించకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. గెడ్డలో ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్తాచెదారంతోపాటు మురుగు నీరు నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల వ్యాప్తితో రోగాల బారిన పడుతున్నామని, రాకపోకల సమయంలో ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. జీవీఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు దృష్టి సారించి గెడ్డలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం జ్యేష్ఠ శుద్ధ పాడ్యమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

ఇరుకు గదుల్లో రెండు స్టేషన్లు

- ఫోర్త్‌టౌన్, ద్వారకా పీఎస్‌ల పరిస్థితి ఇదీ
- ఇబ్బందులు పడుతున్న పోలీస్ సిబ్బంది, ఫిర్యాదుదారులు



హైవేపై బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఫోర్త్‌టౌన్, ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్లు

సీతమ్మధార: నగరంలోనే అది ఎంతో కీలకమైన పోలీస్ స్టేషన్. దీని పరిధిలో ఎంతో మంది వీఐపీలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు నివసిస్తున్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ మేడ మీదే ద్వారకా జోన్ స్టేషన్ కూడా నిర్వహించడం తెలిసిందే. రెండు స్టేషన్లలోనూ శాంతిభద్రతలు, ట్రాఫిక్, క్రైం విభాగాలు ఉన్నాయి. ఫోర్త్‌టౌన్ స్టేషన్‌లో శాంతిభద్రతల విభాగంలో 51 మంది, ద్వారకా స్టేషన్‌లో 62 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఇరుకు గదులు కావడంతో ఫిర్యాదుల స్వీకరణ, ఫిర్యాదుదారులు, నిందితుల విచారణ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదిలో వేచి ఉండలేక, ఉన్నతాధికారులు వచ్చే వరకు ఫిర్యాదుదారులు స్టేషన్ ఆవరణలోను, రోడ్డు మీదనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

స్థలం లేక రోడ్డు మీదే పార్కింగ్

ఈ స్టేషన్ల ఆవరణలో తగినంత స్థలం లేకపోవడంతో ఉన్నతాధికారులు రాకపోకలు సాగించే వాహనాలను కూడా రోడ్డు మీదే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి. పలు కేసులకు సంబంధించి సీజ్ చేసిన వాహనాలు కూడా స్టేషన్ ఆవరణలోనే పేరుకుపోవడం గమనార్హం. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు కూడా ఏది ఫోర్త్‌టౌన్, ఏది ద్వారకా పోలీస్ స్టేషన్ అన్నది సులభంగా గుర్తించలేక తికమక పడుతున్నారు.

అధిక సంఖ్యలో ఫిర్యాదుదారుల తాకిడి

ఫోర్త్‌టౌన్ పరిధిలో అక్కయ్యపాలెం, దొండపర్తి, కైలాసపురం, తాటిచెట్లపాలెం, లలితానగర్, సీతమ్మధార, రైల్వే న్యూకాలనీ తదితర ప్రాంతాలు ఉన్నాయి. ద్వారకానగర్, అశోక్‌నగర్, రామాటాకీస్, ఆశీలమెట్ట, సీతంపేట, గురుద్వారా, శాంతిపురం తదితర ప్రాంతాలు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తాయి. దీంతో నిత్యం రెండు స్టేషన్లకు అధిక సంఖ్యలో ఫిర్యాదుదారులు పలు కేసుల నిమిత్తం వస్తుంటారు. ద్వారకా స్టేషన్ పరిధిలో వైట్‌కాలర్ నేరాలు ఎక్కువగా నమోదవుతుంటాయి. ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా గొడవలు, దొంగతనాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో సిబ్బంది ఫిర్యాదుదారులకు సేవలు అందించడానికి గాను విశాలమైన గదులు లేక ఇబ్బందికరంగా ఉంటుంది. పలు కేసులకు సంబంధించి సీజ్ చేసిన సామగ్రి కూడా గదులను ఆక్రమిస్తున్నాయి. ఈ కారణంగా ఇటు సిబ్బంది.. అటు ఫిర్యాదుదారులు ఇక్కట్లు పడుతున్నారు.

అలరించిన ఘంటసాల గానావధానం



లఘు నాటిక ప్రదర్శిస్తున్న గ్రూప్ సభ్యులు



ఘంటసాల గానావధానం నిర్వహిస్తున్న డాక్టర్ రహమతుల్లా

సీతంపేట: ఘంటసాల ఆరాధకుల టెలిగ్రామ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన ఘంటసాల ఆరాధనోత్సవాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వైద్యుడు సయ్యద్ రహమతుల్లా నిర్వహణలో గాయనీగాయకులు పాత పాటలను మధురంగా పాడారు. టెలిగ్రామ్ గ్రూప్ సభ్యులు రెండు గ్రూపులుగా ఏర్పడి చెడుగుడు ఆట తరహాలో పాటలకు లయబద్ధంగా స్టెప్పులు వేస్తూ ప్రేక్షకులను ఆనంద పరవశులను చేశారు. ఈ సందర్భంగా సోమయాజుల సత్యవాణి, హెచ్.సావిత్రి, సిహెచ్.నందగోపాల్ ప్రదర్శించిన ఘంటసాల లఘు నాటికలు ప్రేక్షకులను మైమరపింపజేశాయి. గానలహరిలో గాయనీ గాయకులు డాక్టర్ కె.రామ్మూర్తి, ఎం.ఎస్.వి.సుబ్బారావు, జి.నానాజీ, కె.రాజేంద్రప్రసాద్, బెహరా మురళి, బి.కల్యాణి, ఎస్.రేణుక ఆలపించిన ఘంటసాల పాటలు ఉర్రూతలూగించాయి. చివరగా డాక్టర్ రహమతుల్లా నిర్వహించిన ఘంటసాల గానావధానం ప్రక్రియ తీరు ఆకట్టుకుంది. వ్యాఖ్యాతగా మేడా మస్తాన్ రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో డాక్టర్ జి.మహేష్, జి.వి.రావు, కె.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



గౌరీ సంక్షేమ సమితి నూతన కార్యవర్గ సభ్యులు

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్‌లోని శ్రీగౌరీ డిగ్రీ కళాశాలలో ఆదివారం గౌరీ సంక్షేమ సమితి 2024–26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించినట్లు ఎన్నికల అధికారి ఆదారి నళిని తెలిపారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా డాక్టర్ ఎం.చంద్రశేఖర్‌రావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా పి.సన్యాసిరావు, కోశాధికారిగా ఎస్.జగ్గ అప్పారావు, డైరెక్టర్లుగా ఎ.వి.ప్రసాద్, సిహెచ్.అప్పారావు, పి.రామారావు, ఆర్.రామారావు, బి.వి.సత్యనారాయణ, ఎస్.సత్యనారాయణ, బి.వెంకటరావు, బి.రామచంద్రరావు, డి.శ్రీరామకృష్ణలు ఎన్నికైనట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గ సభ్యులను పలువురు సమితి సభ్యులు అభినందించారు.

కొండవాలులో వెలగని వీధిలైట్లు



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న గంకల అప్పారావు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం–ఊర్వశి కూడలి కొండవాలు ప్రాంతాల్లో వీధిలైట్లు సక్రమంగా వెలగని తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను కార్పొరేటర్ గంకల కవిత దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అందించారు. విద్యుత్ సిబ్బంది పనితీరుపై కార్పొరేటర్ కవిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొండవాలు ప్రాంతాల్లో వర్షాలకు చెట్ల కొమ్మలు పడిపోవడం, విషకీటకాలు ఎక్కువగా ఉండటంతో పాదచారులు, స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించడంతో ఆదివారం సాయంత్రం బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు సమస్య ఉన్న ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. సమస్యను గుర్తించిన అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపడతామని నివాసులకు హామీ ఇచ్చారు.

కేంద్రం ఆంక్షలతోనే స్టీల్‌ప్లాంట్‌కు ముప్పు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం పగబట్టిందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు బి.మల్లయ్య, తౌడన్న ఆరోపించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. 1228వ రోజు దీక్షా శిబిరంలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత గనులు లేకపోయినా సామర్థ్యానికి మించి ఉత్పత్తులు సాగించిన ఘన కీర్తి విశాఖ ఉక్కు సొంతమన్నారు. విశాఖ ఉక్కు సామర్థ్యాన్ని పెంచేందుకు డీపీఆర్ సిద్ధంగా ఉన్న పరిస్థితుల్లో కేంద్రం తన అనుయాయులకు కర్మాగారాన్ని అప్పగించాలనే కుట్రతో విష ప్రచారం మొదలు పెట్టి ప్రైవేటీకరణకు తెరలేపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో విశాఖ ఉక్కును కొనసాగిస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కర్మాగారం కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరుల త్యాగానికి ఫలితం ఉంటుందని, వేలాది ఎకరాలు నామమాత్రపు ధరకు అప్పగించిన నిర్వాసితుల త్యాగానికి గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు, శ్రీనివాసనాయుడు, పుల్లారావు, విళ్లా రామ్మోహన్ కుమార్, ఎల్.వి.రమణ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను పరిరక్షించుకోవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

- యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అంబేడ్కర్

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ అన్నారు. జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం ఎన్‌పీడీలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. 'ప్రభుత్వ బడులు పరిరక్షించుకుందాం– పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దాం' పేరిట ముద్రించిన కరపత్రాలను సంఘం నాయకులతో కలసి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించే విధంగా వారి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతీ ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు పైడిరాజు, ఉమాదేవి, రాంబాబు, సత్యం, రాము, రిజ్వాన్, రియాజ్ జిల్లాలోని 11 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

గురుకులంలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

సబ్బవరం: సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6,7,8,9వ తరగతుల్లో ఎస్సీ కేటగిరీలో మిగిలిపోయిన సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా విద్యార్థి ఆధార్, క్యాస్ట్ సర్టిఫికెట్‌తో వచ్చి స్థానిక గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సబ్బవరం గురుకుల పాఠశాలలో ఉదయం 10 నుండిచి 12 గంటల వరకూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 80084 69493 నంబర్‌లో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో సందడి



రుషికొండ బీచ్‌లో పర్యాటకులు

కొమ్మాది: పర్యాటక ప్రాంతాలన్నీ ఆదివారం జనంతో కళకళలాడాయి. సాయంత్రం నుంచి వందలాది మంది పర్యాటకులు సాగర్‌నగర్, రుషికొండ, తొట్లకొండ, భీమిలి బీచ్‌లో స్నానాలు చేస్తూ ఉపశమనం పొందారు. తిమ్మాపురంలోని రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, బావికొండ, మంగమారిపేట తొట్లకొండపైకి పర్యాటకుల రాకపోకలు పెరిగాయి. అంతా సందడి చేశారు.

'కోర్కెల దినం' విజయవంతం చేయండి

ఉక్కునగరం: మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేయడానికి పూనుకుంటోందని, అందుకు అడ్డుకట్ట వేసేందుకు జూలై 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న కోర్కెల దినం విజయవంతం చేయాలని సీఐటీయు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ అన్నారు. ఆదివారం ఉక్కునగరంలో నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలు చేసే ఉత్తర్వులను ఇవ్వడానికి సిద్ధపడుతోందన్నారు. తక్షణమే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రైవేటీకరణను, జాతీయ నగదు బదిలీకరణ పథకాలను ఆపాలని, కనీస వేతనాలు నెలకు రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని కోరారు. ఎస్.జ్యోతీశ్వరరావు, పి.మణి, బి.జగన్, పి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

రక్షక్ డ్రైవర్‌కు ద్వారకా పోలీసుల ఆర్థిక సాయం



సురేష్‌కు రూ.30 వేలు అందజేస్తున్న సీఐ రమేష్, ఎస్‌ఐలు, సిబ్బంది

సీతమ్మధార: రోడ్డు ప్రమాదంలో కుమార్తెను కోల్పోయిన కమ్యూనిటీ హోం గార్డు డ్రైవర్ కుటుంబానికి ద్వారకా స్టేషన్ పోలీసులు బాసటగా నిలిచారు. ఈ స్టేషన్ రక్షక్ వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్న బి.సురేష్ కంచరపాలెం జాషువానగర్‌లో భార్య, కుమార్తెలతో కలిసి నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి సురేష్ తన కుమార్తె పూజిత(9)తో కలిసి రైల్వే న్యూకాలనీ వెళ్లి తిరిగి వస్తుండగా తాటిచెట్లపాలెం జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమార్తె మరణించడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో సురేష్ కుటుంబానికి ద్వారకా జోన్ పోలీస్ అధికారులు, సిబ్బంది ఆర్థిక సాయం చేశారు. ఆదివారం స్టేషన్‌లో ద్వారకా సీఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ధర్మేంద్ర, శ్రీను, సిబ్బంది రూ.30 వేలను సురేష్‌కు అందించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ డి.వి.రత్నం, హెచ్‌సీలు శంకర్, కె.శ్రీను, సిహెచ్.శ్రీను, రామ్మూర్తిరాజు, పీసీలు ఎస్.రమేష్, కె.టి.వి.రమేష్, శ్రావణి పాల్గొన్నారు.

ముస్లింల వివాహ వేదికకు అనూహ్య స్పందన



మాట్లాడుతున్న హైదర్ ఆలీ సింకా

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు టీఎస్ఎన్ కాలనీలోని హోటల్ సింకా గ్రాండ్‌లో ఆదివారం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ విశాఖ ఆధ్వర్యంలో ముస్లిం ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలతోపాటు విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు ముస్లింలు హాజరయ్యారు. వారి అర్హతలను బట్టి తమ పిల్లలకు సంబంధాలను కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు హైదర్ ఆలీ సింకా మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఆరు సార్లు ఉచిత వివాహ పరిచయ వేదికలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం ఏడో వేదికను నిర్వహించామన్నారు. వీటి ద్వారా ఇప్పటి వరకు చాలా మంది వివాహాలు చేసుకుని ఒక్కటయ్యారని చెప్పారు. ఇది పూర్తిగా ఉచిత సేవ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వేరే ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఉచితంగా భోజన ఏర్పాట్లు చేశామన్నారు. పేద ముస్లింలకు తమ సొసైటీ తరపున షాదీ ఖర్చులు భరించి, ఉచితంగా వివాహాలు కూడా జరిపిస్తున్నామని సింకా తెలిపారు. ఈ కార్యక్రమాలకు అనూహ్య స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్‌ను సొసైటీ సభ్యులు సత్కరించారు. కమిటీ సభ్యులు మీర్ అబ్బాస్ హుస్సేన్, సయ్యద్ అమీర్ జాన్, హమబూబ్ ఆలీఖాన్, షేక్ అహ్మద్ వల్లి, షేక్ అబ్దుల్ మునీర్, మహ్మద్ హబీబ్, హాజీ రహ్మతుల్లా, మెహబూబ్ షరీఫ్, మహ్మద్ లుక్మాన్, అస్గర్ ఆలీ, ముస్లిం కుటుంబాలు పాల్గొన్నాయి.

ఎస్పీ బాలు గీతాలు చిరస్మరణీయం



ఎస్పీ బాలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఘంటసాల అసోసియేషన్ ప్రతినిధులు

సీతంపేట: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చలనచిత్ర రంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఉపకార్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కంచర్ల అచ్యుతరావు కొనియాడారు. గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అక్కయ్యపాలెంలోని స్వరాలయ రికార్డింగ్ స్టూడియోలో నిర్వహించిన ఎస్పీ సినీ సంగీత విభావరిని ఆయన బాలు చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, నివాళులర్పించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాయకుడిగా, నటుడిగా, సంగీత దర్శకుడిగా, స్టూడియో అధినేతగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా ఎస్పీ సినీ రంగానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు కె.వి.సురేష్, పి.శ్యాంసుందర్, సాత్విక, విశ్వప్రసాద్, కోమలి, శివనారాయణ, రాంబాబు, దేవీ మధుప్రియ పాడిన సినీ గీతాలు అలరించాయి. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, గౌరవాధ్యక్షులు కొణతాల రాజు, ఎస్.ఫణిస్వామి, మహమ్మద్ ఖాన్, బొమ్మిడి సత్యనారాయణ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సమాజంలో ఎటువంటి అల్లర్లు, గొడవలు చేయకుండా ఉండాలని, కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలన్నారు. నేరాల జోలికి వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు సీఐ సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

- ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ ఎస్.రమేష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచిగా జీవించాలని రౌడీషీటర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ధర్మేంద్ర, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశక్తి అమ్మవారి జాతర



అలంకరణలో అమ్మవారు

అల్లిపురం: కొబ్బరితోట వాసుల ఆరాధ్య దైవం స్వయంభూ ఆదిశక్తి అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవారు జాము నుంచి పూజలు నిర్వహించారు. భక్తుల గోత్ర నామాలతో విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు మజ్జిగ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయంతో పాటు కొబ్బరితోట వీధులన్నీ రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

టాయిలెట్లు సరే.. తాళం తీయరే..!



రేసపువానిపాలెం బస్ బే వద్ద తాళం వేసి ఉన్న మరుగుదొడ్లు

సీతమ్మధార: స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా జీవీఎంసీ ఆధ్వర్యంలో నగరంలో నిర్మించిన ఆధునిక బస్ బేల వద్ద టాయిలెట్లు నేటికీ వినియోగంలోకి రాలేదు. 24వ వార్డు రేసపువానిపాలెం సీఎంఆర్ సెంట్రల్ బస్ బే, గురుద్వారా జాతీయ రహదారి బస్ బేల వద్ద మరుగుదొడ్లు నిర్మించారు. వాటి తాళాలు తీయడానికి జీవీఎంసీ జోన్–3 అధికారులకు ఇప్పటికీ తీరిక దొరకడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఈ బస్ బేల వద్ద 540, 222ఏ, 500, 541, 111, లైన్ బస్సులు ఆగుతాయి. నిత్యం ఈ రెండు బస్ షెల్టర్ల వద్ద అధిక సంఖ్యలో ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉంటారు. ఇక్కడి మరుగుదొడ్లు వినియోగంలోకి రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే బస్ బేల వద్ద టాయిలెట్లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.